ఏకలవ్య పాఠశాలకు మోక్షమెప్పుడో?

- గ్రౌండ్ ఫ్లోర్ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని దుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాల
- రూ.12 కోట్లతో 2019లో నిర్మాణానికి శంకుస్థాపన
- రెండో ఫేజ్‌లో మొదటి అంతస్తు నిర్మాణానికి మరో రూ.5 కోట్లు విడుదల
- సిద్ధమైన డార్మెటరీలు, ప్రిన్సిపాల్, సిబ్బంది క్వార్టర్లు
- అరకులోయలో చాలీచాలని గదుల్లో పదేళ్లుగా పాఠశాల నిర్వహణ



దుంబ్రిగుడలో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తి చేసుకున్న ఏకలవ్య పాఠశాల భవనం



అరకులోయలో గదులు లేకపోవడంతో వరండాలో కూర్చున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

దుంబ్రిగుడ: అరకులోయలోని ఏకలవ్య పాఠశాలకు మోక్షం కలగడం లేదు. పదేళ్లుగా చాలీచాలని గదుల్లో కొనసాగుతోంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలను గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండల కేంద్రం దుంబ్రిగుడలో ఏకలవ్య పాఠశాల కోసం ఆధునిక భవనాల నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేసింది. 2019లో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ విశాఖపట్నం పర్యవేక్షణలో మొదలు పెట్టారు. తొలుత ఈ పనులు చకచకా సాగాయి. దాంతో గ్రౌండ్ ఫ్లోర్ పనులు 2022–23లోనే పూర్తయ్యాయి. ఈ భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో అరకులోయలో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలను దుంబ్రిగుడకు తరలించడానికి కొంత సమయం పట్టింది.

- అందులో భాగంగానే మొదటి అంతస్తు పనులకు 2023లో రెండో ఫేజ్‌లో మరో రూ.5 కోట్ల నిధులు విడుదలయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో పాటు డార్మెటరీల నిర్మాణానికి ఒక్కరే కాంట్రాక్టర్ కావడంతో నిర్మాణం పనులు సజావుగా సాగాయి. మొదటి అంతస్తుకు పిల్లర్ల దశ నుంచి శ్లాబ్ దశకు నిర్మాణం జరిగింది. ఉపాధి హామీ నిధులు రూ.80 లక్షలతో ప్రహరీ పనులు జరుగుతున్నాయి. సుమారు ఆరేళ్లు కావస్తున్నా అరకులోయ నుంచి దుంబ్రిగుడలోని నిర్మించిన భవనంలోకి పాఠశాలను తరలించకపోవడంతో విద్యార్థులు మానేస్తున్న సందర్భాలు ఉన్నాయి. కొత్త భవనంలో 6 నుంచి 10వ తరగతి వరకూ కొనసాగిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పదేళ్లుగా అవస్థలు

అరకులోయలో గత పదేళ్లుగా చిన్న క్యాంపస్‌లో ఏకలవ్య పాఠశాల కొనసాగుతోంది. చాలీచాలని గదుల్లో తరగతులు, హాస్టల్ నిర్వహణ సాగుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు సరైన వసతి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఒకే చోట బాలికలు, బాలురు ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దుంబ్రిగుడలో మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తయిన భవనానికి విద్యార్థులను తరలిస్తే బాగుంటుందని వారంతా అభిప్రాయపడుతున్నారు.

భూనిర్వాసితుల ఆందోళన


ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన నలుగురికి ఉపాధి కల్పిస్తామని అధికారులు ఇచ్చి హామీ నెరవేరలేదు. వీరిలో ఒక్కరికి ప్రస్తుతం ఉపాధి కల్పించారు. మిగతా ముగ్గురికి ఉపాధి కల్పించకపోవడంతో రెండు నెలల పాటు రోడ్డుపై ధర్నాలు, దీక్షలు చేపట్టారు. దాంతో ప్రహరీ పనులు ఆగిపోయాయి. భవన నిర్మాణ సామగ్రి తరలించేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఇక్కడ సూపర్‌వైజర్ తెలిపారు.



పూర్తయిన విద్యార్థుల డార్మెటరీ గదులు



ఉపాధ్యాయుల క్వార్టర్స్



ప్రస్తుతం అరకులోయలో కొనసాగుతున్న ఏకలవ్య పాఠశాల భవనం



ప్రిన్సిపాల్ కోసం నిర్మించిన క్వార్టర్

క్లుప్తంగా

దుంబ్రిగుడ హైవేలో సోలార్ వెలుగులు



దుంబ్రిగుడలో క్రేన్ సహాయంతో సోలార్ లైట్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: మండల కేంద్రం దుంబ్రిగుడలోని జాతీయ రహదారిపై మంగళవారం సోలార్ లైట్లను క్రేన్ సహాయంతో హైవే సిబ్బంది ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అరకు సంత బయిలులో గత వారంలో వేసినా సోలార్ లైట్లు హైవేకు సాయంత్రం పూట కొత్త అందాలను తీసుకువచ్చింది. తాజాగా దుంబ్రిగుడ మండల కేంద్రంలోని సంతవలస జంక్షన్ నుంచి ఏకలవ్య పాఠశాల జంక్షన్ వరకు సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు.

వితంతు పెన్షన్ కోసం వినతి



వితంతు పెన్షన్ మంజూరు కోరుతూ వినతి పత్రం అందిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ నేతలు

అడ్డతీగల: వితంతు పెన్షన్‌కు అర్హురాలైన అడ్డతీగలకు చెందిన గోపి వీరరాఘవ అనే మహిళకు మంజూరు చేయాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ అడ్డతీగల మండల అధ్యక్షుడు ఎస్.వి.రమణ, ఉపాధ్యక్షుడు ఎస్.కె.నవాజ్ ఎంపీడీవో కె.ఆర్.విజయకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పలుమార్లు వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసినా మంజూరు చేయడం లేదని సంస్థ దృష్టికి వచ్చిందన్నారు. ఆమెకు పెన్షన్ వచ్చేలా కృషి చేస్తానని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.


గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు



దుంబ్రిగుడ శాఖ గ్రంథాలయంలో పిల్లలకు డ్రాయింగ్ పోటీలు

దుంబ్రిగుడ: దుంబ్రిగుడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని పలు చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. గ్రంథాలయ అధికారి ఎస్.సునీత మాట్లాడుతూ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు అవసరం



డాక్టర్ మస్తాన్ వల్లీ

సీలేరు: ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సీలేరు ప్రాథమిక ఆస్పత్రి వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లీ సూచించారు. స్థానిక విలేకర్లతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి సీలేరు పంచాయతీ పరిధిలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు. ప్రతి రోజు 2 నుంచి 3 లీటర్ల వరకు మంచినీటిని తాగాలని సూచించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు బయటికి వెళ్లకూడదని, ఒకవేళ వడదెబ్బ తగిలితే స్థానిక పీహెచ్‌సీకి తీసుకొచ్చి మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మ ఉత్సవాల ముహూర్తపు రాట

పెదబయలు: పెదబయలు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ముహూర్తపు రాట వేయనున్నట్టు ఉత్సక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కిమంకరి బొంజుబాబు, తలారి చక్రధర్ తెలిపారు. ఉదయం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం రాటను ఊరేగింపుగా తీసుకెళ్లి శతకం పట్టు వద్ద ప్రతిష్ఠిస్తామన్నారు.

సొవ్వా క్రికెట్ టోర్నీ విజేత కోరంజీగుడ



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ దేముడువలసలో నిర్వహించిన సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో కోరంజిగూగ గ్రామం విన్నర్‌గా, కమలబంధ గ్రామం రన్నర్‌గా నిలిచింది. రెండు టీమ్‌లకు సొవ్వ పంచాయితీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాక సింహాచలం, పాండోయి అశోక్‌కుమార్, పాంగి నరసింగరావు ఆధ్వర్యంలో మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించి గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పి.రాంప్రసాద్, టోర్నమెంట్ మేనేజ్‌మెంట్ సభ్యులు అనిల్, రామ్‌నాథ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బురద నీరే.. తాగునీరు



గేదలబంధలో వర్షంలో బురదగా మారిన ఊటనీరు..

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ గేదలబంధ గ్రామ గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బురదనీరే దిక్కవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం గిరిజన సంఘం మండల నేతల ఎదుట తాగునీటి కోసం పడుతున్నా ఇబ్బందులను గేదలబంధ గ్రామ గిరిజనులు ఏకరువు పెట్టారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఊటనీరు బురదమయంగా మారిపోయిందని, దీంతో తాగునీటి కోసం గ్రామంలో 40 కుటుంబాలు పడరాని పాట్లు పడుతున్నామని వాపోయారు. నీటి సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కరువైందని ఆరోపించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నేతలు నారాయణ, జీనబంధు, సీతారామ్ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మొద్దు నిద్రను వీడి గ్రామాల్లో నీటి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. తక్షణమే నీటి సమస్యను పరిష్కరించని పక్షంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట గేదలబంధ గ్రామ గిరిజనులతో కలిసి ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

గొబ్బరపాడలో ప్రత్యేక వైద్య శిబిరం



శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ మారుమూల గొబ్బరపాడ గ్రామంలో లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజనులను డోలీ మోతలో ఆస్పత్రులకు తరలిస్తున్నట్టు వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన వైద్యాధికారి శ్యాంప్రసాద్ ఈ శిబిరం నిర్వహించారు. 58 మందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని వైస్ ఎంపీపీ భాగ్యవతి సందర్శించి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొబ్బరపాడ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర సమయాల్లో డోలీ మోతే దిక్కుగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గొబ్బరపాడ గ్రామానికి రహదారి నిర్మాణం కోసం గతంలోనే నిధులు మంజూరైనా కూటమి ప్రభుత్వం పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. తక్షణమే రహదారి పనులు ప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు.

'నాసిరకం మెటీరియల్‌తో రోడ్డు నిర్మాణం'



రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ కారం లక్ష్మి

వీఆర్‌పురం: వడ్డుగూడెం బీసీ కాలనీ నుంచి రేఖపల్లి వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణం నాసిరకంగా సాగిందని ఎంపీపీ కారం లక్ష్మి ఆరోపించారు. ఈ సందర్భంగా వడ్డుగూడెం బీసీ కాలనీలో రోడ్డును మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు వేసిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్నారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సున్నం రాజులు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, కారం సుందరయ్య, పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, గుండెపుడి లక్ష్మణరావు, సీరపు తాతబాబు, వడ్లాది రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

గూడెం కొత్తవీధి: జల జీవన్ మిషన్ నిధులతో పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, దామనాపల్లి సర్పంచ్ కుందరి రామకృష్ణ తెలిపారు. పంచాయతీలో జలజీవన్ మిషన్ నిధులతో బోరు తవ్వకం పనులను ఆయన మంగళవారం ప్రారంభించారు.

బాలల రక్షణ సమష్టి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీవో వరహాలమ్మ

ముంచంగిపుట్టు: బాలల రక్షణ కోసం అందరూ సమష్టిగా పని చేయాలని సీడీపీవో వరహాలమ్మ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికల వికాసం అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ వచ్చే నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు గ్రామస్థాయిలో కిశోరబాలికలకు వేసవి ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఏపీఎం కళావతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో రంపచోడవరం ఐటీడీఏ

అడ్డతీగల: చలో రంపచోడవరం ఐటీడీఏ కార్యక్రమం బుధవారం తలపెట్టామని, ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ సంఘాల కూటమి నేతలు వెదుళ్ళ లచ్చిరెడ్డి, తీగల బాబూరావు, లోతా రామారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆదివాసీ నిరుద్యోగులు, యువత, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాజవొమ్మంగిలో చలివేంద్రం ప్రారంభం



రాజవొమ్మంగిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ సన్యాసినాయుడు

రాజవొమ్మంగి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ సన్యాసినాయుడు మంగళవారం ప్రారంభించారు. చల్లని మజ్జిగ ఆయన స్వయంగా పంపిణీ చేశారు. బస్‌ల కోసం వేచి ఉండే ప్రయాణికులు, పరిసర గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ నరసింహమూర్తి, పోలీస్ సిబ్బంది, పలువురు స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పలు కమిటీలకు చైర్మన్ల నియామకం

వీఆర్‌పురం: మండలంలోని పలు ఆలయ, ఆస్పత్రుల కమిటీలకు చైర్మన్ల నియామకం చేపట్టారు. శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్‌గా పెందుర్తి సుదర్శన్‌రావు, వడ్డుగూడెం దేవస్థానం చైర్మన్‌గా బొర్ర ఆదినారాయణ, రేఖపల్లి ఆసుపత్రి చైర్మన్‌గా బీరాక సూర్యప్రకాష్ రావు, రాయి గూడెం ఆసుపత్రి చైర్మన్‌గా కోట్ల మెహన్‌రావు, వీఆర్‌పురం మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తీర్మానించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే రహదారులకు మహర్దశ



పూలజాల్మకు జరుగుతున్న తారు రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజన గ్రామాల రహదారులకు మహర్దశ వచ్చిందని వైఎస్సార్‌సీపీ జిల్లా నేత జె.వి.ఎస్.మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండలంలోని అత్యంత మారుమూల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రం నుంచి పూలజాల్మకు జరుగుతున్న రహదారి పనులను మంగళవారం వారు పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నాణ్యతగా తారురోడ్డు వేయాలని కోరారు. బుంగాపుట్టు సర్పంచ్ నొబిన, బుంగాపుట్టు, డేగమజ్జిగూడ, పూలజాల్మలకు చెందిన గిరిజనులు వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజూరు చేసి పనులు ప్రారంభించారని, నేడు తారు రోడ్డు సౌకర్యం కలుగుతుందంటే అప్పటి అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ, ఎంపీ మాధవీతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పుణ్యమేనని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బుంగాపుట్టు, భూసిపుట్టు, రంగబయలు పంచాయతీలకు తారు రోడ్లు వేశామని, ఈ మూడు రోడ్లు వేయడంతో 95 గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తీరాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నేతలు అర్జున్, అప్పారావు, సన్యాసిరావు, రాజారావు, సీతారామ్, సాధురాం పాల్గొన్నారు.

7 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ దాసుబాబు

అరకులోయ టౌన్: అరకులోయలో వచ్చే నెల 7 నుంచి 11వ తేదీ వరకు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ దాసుబాబు తెలిపారు. మంగళవారం జెడ్పీ అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది కల్యాణోత్సవాలు గతం కంటే వైభవంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అవసరమన్నారు. 7న విష్వక్సేన పూజ, 8న స్వామి వారి కల్యాణం, 9న వైకుంఠ పార్షద సూక్ష్మహోమాదికాలు(సదస్యం), 10న స్వామి వారి గ్రామోత్సవం–ఊరేగింపు, 11న దర్పణ దర్శనం ఉంటుందన్నారు. 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సివేరి బాలకృష్ణ, కమిటీ ప్రతినిధి ఎల్.బి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీకరిలో సామాజిక భవనం పనులకు శంకుస్థాపన

పెదబయలు: మండలంలోని సీకరి పంచాయతీ కేంద్రంలో ఎంపీ నిధులు రూ.30 లక్షలతో సామాజిక భవనం నిర్మాణానికి బుధవారం ఉదయం భూమి పూజ చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు తెలిపారు. అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల నాయకులు, స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు హాజరు కావాలని కోరారు.